సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


ఎంపికైన వెంకటప్ప స్కూల్ విద్యార్థినులు

గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 14, 15, 16న జరిగే అథ్లెటిక్స్ పోటీలకు వెంకటప్ప స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. గత నెల 25న ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచారు. ఇందులో 100మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో భార్గవి, షాట్‌పుట్, జావలిన్‌త్రోలో అంజలి, డిస్కస్‌లో తజిత ప్రథమస్థానంలో నిలిచారు. జావలిన్‌త్రోలో వైష్ణవి ద్వితీయ స్థానం, కిడ్ జావలిన్‌త్రోలో యశశ్విని ప్రథమ స్థానంలో నిలిచారు. – పులివెందుల టౌన్

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /24.1

జిల్లాలో సోమవారం 24.1 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. – కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా మూడోరోజు కూడా జిల్లాలోని పలు మండలాల్లో వర్షం కురిసింది. పులివెందులలో 13 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బద్వేల్‌లో 6.8, ముద్దనూరులో 5.4, ఎర్రగుంట్లలో 5, వేములలో 4, కొండాపురంలో 2.8, సీకేదిన్నెలో 2,6, కడపలో 2, బిమఠంలో 1.4, వేంపల్లెలో 1.8, కమలాపురం, కొండాపురం, వల్లూరు, చెన్నూరు. పెండ్లిమర్రిలలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బాధ్యతల స్వీకరణ



కడప అగ్రికల్చర్ : ఆంధ్రప్రదేశ్ సూక్ష్మసేద్య పథక ఎఫ్ఏసీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మురళీమోహన్ రెడ్డి సోమవారం కడపలోని ఏపీఎంఐపీ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఏపీ ఎంఐపి పీడీగా పనిచేస్తున్న రవీంద్రనాథరెడ్డి గత నెల 31వ తేదీన పదవీ విరమణ చెందారు. దీంతో ఆయన స్థానంలో ఏపీ ఎంఐపీ ఏపీడీగా పనిచేస్తున్న మురళీమోహన్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి ఈడీగా చెంగల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా చెంగల్‌రెడ్డిని నియమిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావును విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు.

కొత్త ఉత్సాహం

- నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- సవాళ్లు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొందాం
- ఇడుపులపాయలో తండ్రి వైఎస్సార్‌కు ఘన నివాళి
- మూడు రోజుల పర్యటన అనంతరం తాడేపల్లికి చేరిక


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో వైఎస్ విజయమ్మ

సాక్షి కడప : ఎల్లప్పుడూ కష్టాలు ఉండవు...ప్రస్తుతం పరిస్థితులు చూస్తున్నాం.,అంతలోనే ఎంతమార్పో గమనించండి...ప్రజలు మనవైపు ఉన్నారు..సవాళ్లు, ఆంక్షలు, సమస్యలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన దిశా నిర్దేశంతో శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ..నిరుత్సాహంగా ఉన్న వారిలో కొత్త ఉత్సాహం నింపుతూ పార్టీ అధ్యక్షుడి హోదాలో శ్రేణుల్లో చైతన్యం తీసుకొచ్చారు. మూడు రోజుల పర్యటనలో జిల్లాలోని ప్రజలతోపాటు పార్టీ శ్రేణులు, వివిధ వర్గాల వారు కలిసి సమస్యలతోపాటు అనేక విషయాలను ఆయనతో పంచుకున్నారు. ప్రధానంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానంతో అడుగడుగునా ఆయనకు హారతులు పడుతుండడంతో తొలిరోజు మధ్యాహ్నం చేరుకోవాల్సిన పర్యటన రాత్రి వరకు కొనసాగిందంటే ఆ కుటుంబంపై ఉన్న అభిమానం ఎలాంటిదో అర్థమవుతోంది.

అదే అభిమానం..అదే ఆత్మీయత

పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల ప్రజలతోపాటు కార్యకర్తలు, శ్రేణులు అదే అభిమానం..అంతకంటే ఎక్కువ ఆత్మీయత చూపారు. ప్రతి ఒక్కరూ మాజీ సీఎంతో కరచాలనం చేస్తూ ఉత్సాహం చూపారు. తమ అభిమాననేతతో సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా వారిని పేరుపేరున పలుకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వెంకటప్ప స్కూలు చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అంతేకాకుండా పెండ్లిమర్రి మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాచునూరు చంద్రారెడ్డి మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను ఓదార్చారు. పులివెందులకు చెందిన అనారోగ్య బాధితులకు ఆరోగ్య భరోసా ఇచ్చారు. గొందిపల్లెలో నూతన జంటను ఆశీర్వదించారు. ఇలా అందరికీ నేనున్నానని..మీకేం కాదని మాజీ సీఎం వైఎస్ జగన్ అభయం నింపారు.

కదిలివచ్చిన జనతరంగం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో ఉన్నారన్న విషయాన్ని తెలుసుకున్న ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చారు. జనం అధిక సంఖ్యలో తరలి రావడంతో పోలీసులు అదుపు చేయడం కష్టతరంగా మారింది. పులివెందుల, పెండ్లిమర్రి, వేంపల్లె, కడప ఇలా అన్నిచోట్ల కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలువురిని కరచాలనం చేయడంతోపాటు అందరికీ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సమాధి ఘాట్ వద్ద మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులతోకలిసి నివాళులర్పించారు. ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం తండ్రి విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఘాట్ ఆవరణలో ఉన్న ప్రజలందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు అడుగులు వేశారు.

పర్యటన విజయవంతం

మూడు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. ఈ దఫా పర్యటనలో పార్టీ నేతలు, శ్రేణులను కలుస్తూ కష్టసుఖాలు అడిగి తెలుసుకోవడంతోపాటు పార్టీ కోసం కష్టపడేలా చైతన్యవంతులను చేశారు. మూడోరోజు ఉదయం కడప నుంచి బయలుదేరి తాడేపల్లికి చేరుకున్నారు. జిల్లాలో మూడు రోజుల పర్యటన విజయవంతం కావడంతో పార్టీ శ్రేణులతోపాటు నేతల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.


నివాళులు అర్పిస్తున్న వైఎస్ భారతిరెడ్డి


కుమారుడిని ఆప్యాయంగా ముద్దాడుతున్న వైఎస్ విజయమ్మ


వైఎస్ జగన్ కోసం ఎదురుచూస్తున్న జనం


వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపుతున్న అభిమానులు

రాజన్నా...నిను మరువలేము

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌కు ఘన నివాళి
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గుర్తు చేసుకున్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ 15వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

- కడప నగరంలో హెడ్‌పోస్టాఫీసు ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబు, రాజంపేట, బద్వేల్ ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, డాక్టర్ దాసరి సుధలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పాల్గొన్నారు.
- పులివెందుల బాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పులివెందులలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలు వరప్రసాద్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.
- ప్రొద్దుటూరు పట్టణంలో మైదుకూరు రోడ్డులో అన్వర్ థియేటర్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బి. లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పి. బంగారు మునిరెడ్డి, జెడ్పీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ శారద, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.
- మైదుకూరు బస్టాండు పక్కన ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- జమ్మలమడుగులో టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.
- కమలాపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు అల్పాహారం పంపిణీ చేశారు.

3,6 తేదీల్లో సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో వర్షం కారణంగా అన్ని యాజమాన్య పాఠశాలలకు 2వ తేదీ సెలవు ప్రకటించడంతో ఆ రోజు నిర్వహించాల్సిన సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్ష(ఎస్ఏఎంపీ) -1ను ఈనెల 3,6 తేదీల్లో నిర్వహించాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈవీఎస్ పరీక్షను 3వ తేదీ, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించాల్సిన గణిత పరీక్షను 6వ తేదీ జరపాలని చెప్పారు. ఈ విషయాన్ని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు గమనించాలని డీఈఓ కోరారు.

నేడు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి, నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభి టెక్నాలజీస్, అమర్ రాజా గ్రూప్, అల్ డిక్సన్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, నవత ట్రాన్స్‌పోర్టు కంపెనీల్లో వివిధ పోస్టులకు ఈ మేళా నిర్వహిస్తున్నారన్నారు. 5, 10, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, పీజీ అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. 18–55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి వారు అర్హులన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

జమ్మలమడుగులో

మంగళవారం ఉదయం 10 గంటలకు జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అభి టెక్నాలజీస్, అల్ డిక్సన్, బీజెడ్ ఫిన్‌సర్వ్ కంపెనీలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిగ్రీ, పీజీచదివి 18–32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గండి ఆలయ అర్చకులకు నోటీసులు

చక్రాయపేట : గండి ఆలయ ప్రధాన,ఉప ప్రధాన అర్చకులు కేసరి,రాజారమేష్‌లకు సంజాయిషీ నోటీసులు ఇచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.శ్రావణ మాసం చివరి శనివారం జరిగిన క్షేత్రోత్సవం,ఆస్థానం కార్యక్రమాలకు సంబంధించి పరస్పరం చేసిన ఆరోపణలను సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినందున.. పత్రికల్లో వార్తలు ప్రచురితం అయ్యాయన్నారు.దీంతో అర్చకులు కేసరి,రాజారమేష్‌లకు 24 గంటల లోపు సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.వారు ఇచ్చే సంజాయిషీపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానని తెలిపారు.

చేపలవేటకు లైసెన్స్ జారీ

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని గండికోట, సోమశిల వెనకజలాలతోపాటు బ్రహ్మంసాగర్ రిజర్వాయరులో సెప్టెంబర్ 1వ తేదీ నుంచి చేపలను వేటాడానికి లైసెన్స్‌లు జారీ చేసినట్లు జిల్లా ఉపమత్స్య సంచాలకులు కె. శాంతి తెలిపారు. ప్రతి మత్స్యకారుడు చేపల వేటకు తప్పని సరిగా లైసెన్స్ పొందాలని, లేకపోతే ఏపీ ఫిషరీస్ రూల్స్ 1995 మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

పండుగకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా నుంచి ఈనెల 4వ తేదీన బెంగళూరుకు 6 బస్సులు, 5వ తేదీన 15, 6న 25 బస్సులు నడుస్తాయన్నారు. అలాగే హైదరాబాదుకు ఆయా తేదీల్లో 8 బస్సులు, చెన్నైకి 4 రాకపోకలు సాగిస్తాయన్నారు. ఈనెల 17వ తేదీన అరుణాచలానికి 10 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు.

రేషన్ షాపుల్లో రాగులు, జొన్నలు పంపిణీ

రాయచోటి టౌన్ : సెప్టెంబర్ నెలలో తెల్లరేషన్‌కార్డుదారులకు అందించే బియ్యం, చక్కెరతో పాటు రాగులు, జొన్నలు కూడా అందజేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల అందించే విధంగానే ఈ నెలలో డీలర్ షాపుల ద్వారా లేదా వాహనాల ద్వారా కానీ నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు కిలో చక్కెర రూ.13.50లకు, తెల్లకార్డుదారులకు అర కిలో రూ.17లకు అందిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కలెక్టర్ శివశంకర్


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. సోమవారం డయల్ యువర్ కలెక్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గడువు లోపు అర్జీలు పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏ ఉండరాదని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పేరుతో ఆన్‌లైన్‌లో 1బీ అడంగల్ నిలిపి వేయడం వల్ల రైతులు బ్యాంకుల ద్వారా రుణాలు పొందలేక పోతున్నారని, ఈ సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, ఎర్రగుంట్ల మండలం చిర్రాజుపల్లె గ్రామ రైతులు శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమణ, కలీం, రామిరెడ్డి తదితరులు కోరారు. సమస్యను సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ బదులిచ్చారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప అర్బన్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చేలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి జిల్లా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరిస్తామనీ జిల్లా ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబి అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు, కడప మహిళా పోలీస్‌స్టేషన్ డిఎస్పీ ఎస్. రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబరు 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు.. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో దీనికి సంబంధించిన కరపత్రాలను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడంపై స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతూన్నారన్నారు. మత్తు పదార్థాలను సరఫరాచేసే వారు కానీ, వాటికి అలవాటు పడిన వారు అసాంఘిక అలవాట్లను ప్రేరేపించే వారుగా, కారకులుగా శిక్షార్హులే అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.